క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోకుల్‌నగర్, రాంనగర్, అశోక కాలనీ, పోచమ్మగుడి, విద్యానగర్, గాంధీనగర్, అంబేడ్కర్ భవన్, వాజ్‌పేయి కాలనీ, టీచర కుంట ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, జులైవాడ, బాసిత్ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, పోలీసు కాలనీ, ప్రకాశ్‌రెడ్డి పేట, లోటస్ కాలనీ, గణేష్ నగర్, ఐడిల్ స్కూల్, ఎస్‌వీపీ రోడ్డు, రియా హాస్పిటల్, ములుగు క్రాస్ రోడ్డు, అజర హాస్పిటల్, న్యూ భద్రకాళి టెంపుల్ రోడ్డు, కాపువాడ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటి నుంచి వైద్యుల క్రికెట్ పోటీలు

ఎంజీఎం: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో గురువారం నుంచి 10 రోజుల పాటు వరంగల్ డాక్టర్స్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ముక్క ప్రవీణ్, ఉపాధ్యక్షురాలు ప్రసన్న, కోశాధికారి నదీప్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్ తెలిపారు. కేఎంసీ మైదానంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పగటి వేళలో విధుల దృష్ట్యా క్రికెట్ మ్యాచ్‌లు రాత్రి సమయంలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఆరు జట్లు 12 మ్యాచ్‌లు ఆడనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, నాగరాజు, అజీజ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా ఇంటలెక్చువల్ మీట్



నయీంనగర్: ఓరుగల్లు సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 24న సాయంత్రం హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో మెగా ఇంటలెక్చువల్ మీట్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఏ.సమ్మిరెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల గురించి ఈ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, ముఖ్య నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా గ్రాడ్యుయేట్లు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, ఆర్.రమేష్ రెడ్డి, అశోక్‌రావు, ఆర్.జగదీశ్వర ప్రసాద్, పూర్ణచందర్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజా రామ్మోహన్ రాయ్‌కి నివాళి



హసన్‌పర్తి: సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ జయంతి వేడుకలను ఒకటవ డివిజన్ ముచ్చర్లలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, ప్రమోద్, శ్రీధర్, రాజేష్, సుమన్, బండా సాయిరెడ్డి, సతీష్, కర్ణాకర్, అనిల్, కిరణ్, సుధాకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత



కాజీపేట రూరల్: రైల్వే స్టేషన్లలో, రైల్వే ప్లాట్ ఫాంలపై, రైళ్లలో ప్రయాణిస్తూ మరిచిపోయిన సెల్‌ఫోన్లను బాధితులకు కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు అందజేసినట్లు కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ ఎం.సంజీవరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈఏడాది జనవరి నుంచి మే 22వ తేదీ వరకు 50 సెల్‌ఫోన్లను అప్పగించినట్లు తెలిపారు.

కల్తీని అరికట్టాలని వినతి

హన్మకొండ: ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ కోరారు. హైదరాబాద్ కోటిలోని రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కంట్రోలర్ విజయ కుమార్‌ను పల్లెపాడు దామోదర్, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు బుధవారం కలిసి వినతి పత్రం అందించారు.

పూడికతీత పనులు



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ కాలనీలో మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులను పారిశుద్ధ్య సిబ్బంది కొనసాగిస్తున్నారు. ఆ పనులను కార్పొరేటర్ విజయశ్రీ బుధవారం పర్యవేక్షించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో 25 మంది సిబ్బంది సైడ్ కాలువల్లో పూడికతీత పనులను చేపట్టారు.

గ్రానైట్ లారీలను అడ్డుకుని నిరసన



లారీలను అడ్డుకుని రోడ్డుపై బైఠాయించిన కాలనీ వాసులు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని బృందావన్ కాలనీలో గ్రానైట్ లారీల రాకపోకలను కాలనీవాసులు మంగళవారం రాత్రి అడ్డుకుని తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. జనావాసాల మధ్య క్వారీ పనులు జరగడంతో ఆ శబ్దాలను భరించలేకపోవడంతో పాటు లారీల మోతలు నిద్రకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపిస్తూ బృందావన్, ఏఆర్ఆర్‌నగర్ కాలనీ వాసులు కొద్ది రోజులుగా లారీలను అడ్డుకుంటున్నారు. దాంతో రెండు వర్గాల మధ్య వాగ్వివాదాలు సాగుతున్నాయి. మంగళవారం రాత్రి గ్రానైట్ రాళ్లతో అంతర్గత రోడ్ల మీదుగా వెళ్తున్న పలు లారీలు చూసిన ఆయా కాలనీలకు చెందిన ప్రజలు రోడ్డుపై బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారు. క్వారీ నిర్వాహకులు ఘటన స్థలానికి చేరుకుని ఆవేశంతో మాట్లాడటంతో కాలనీవాసులు అదే స్థాయిలో సమాధానం చెప్పడంతో పరిస్థితి ఒక దశలో చేయి దాటిపోయే పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు జోక్యం చేసుకుని గొడవను సద్దుమణిగేలా చేశారు.

కోర్టు తీర్పునకు లోబడి మసలుకోవాలి

కాలనీవాసులతో పాటు క్వారీ నిర్వాహకులను సీఐ సుధాకర్ రెడ్డి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సమస్య తీవ్రతపై చర్చించారు. ఇరు వర్గాలు ఈ విషయంలో కోర్టుకు వెళ్లిన నేపథ్యంలో తీర్పు వచ్చే వరకు క్వారీ పనులు ఆపాలని ఆదేశించారు. కాలనీవాసులు కూడా ఎలాంటి గొడవలకు దిగకూడదని ఇన్‌స్పెక్టర్ హితవు పలికారు.

సైలెన్సర్లు మారిస్తే క్రిమినల్ కేసులు



సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

వరంగల్ క్రైం: బైక్ సైలెన్సర్లకు ఎలాంటి మార్పు చేసినా సదరు వాహనదారులతో పాటు మార్పు చేసిన బాధిత మెకానిక్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. అధిక శబ్దం చేసే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో కమిషనరేట్ కార్యాలయం జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధిక శబ్దం చేసే బైక్‌లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు. ధ్వంసం చేసిన సైలెన్సర్లలో హనుమకొండకు చెందినవి 73 కాగా, కాజీపేట 88, వరంగల్ 100 ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, షుకూర్, నాగబాబు, ట్రాఫిక్ ఎస్సైలు పూర్ణ చంద్రారెడ్డి, యుగంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయండి



చెరువు కబ్జా గురించి వివరిస్తున్న స్థానికులు

హసన్‌పర్తి: 55వ డివిజన్ భీమారంలోని శ్యామల చెరువు శిఖంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని అధికారులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశించారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును స్థానికులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా చెరువు విస్తీర్ణం, కబ్జాకు గురైన భూమి గురించి వివరించారు. భూమి కబ్జాకు గురైనప్పటికీ నీటి పారుదల శాఖ, కార్పొరేషన్ అధికారులు స్పందించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్రమార్కులను వదిలిపెట్టేది లేదని తేల్చిచెప్పారు. అనంతరం గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్, నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. చెరువుకు హద్దులు నిర్ధారించడమే కాకుండా అందులో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో భీమారానికి చెందిన విక్టర్‌బాబు, ఆకుల కుమార్, చింతల లక్ష్మణ్, బూర శరత్, సమ్మయ్య, రాంరాజు, రామకృష్ణ, ప్రభాకర్, భగత్, సంతోష్, రమేష్, శ్రీధర్, పప్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



సంజీవ్



వెంకటేశ్వర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు ఎస్.సంజీవ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇండియా – ఏ స్టడీ విత్ రెఫరెన్స్ టు తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సంజీవ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ నర్సింహాచారి పర్యవేక్షణలో సంజీవ్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

తెలుగు విభాగంలో వెంకటేశ్వర్లుకు..

గోరటి వెంకన్న సాహిత్యం – సాహిత్య సాంస్కృతిక సామాజిక కోణాలు – సమగ్ర పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు బానోతు వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ ప్రకటించారు. ఆ విభాగం ప్రొఫెసర్ జ్యోతి పర్యవేక్షణలో వెంకటేశ్వర్లు తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

పార్కులను సమర్థంగా నిర్వహించాలి



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: పార్కుల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం కాజీపేట సర్కిల్ పరిధి హసన్‌పర్తిలో బల్దియా ద్వారా నిర్వహిస్తున్న కుక్కల శస్త్ర చికిత్స కేంద్రం, శ్రీనగర్ కాలనీ పార్క్ శాంతివనం, కాశిబుగ్గ పరిధి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రీజనల్ లైబ్రరీ పార్కులను కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. నగరంలో కొన్ని పార్కులను టీఎల్ఎఫ్ వారికి నిర్వహణ కోసం అప్పగించిన నేపథ్యంలో అనుకున్న స్థాయిలో నిర్వహణ జరగడం లేదనే ఆరోపణలున్న నేపథ్యంలో హార్టికల్చర్ విభాగం నుంచి సిబ్బందిని కేటాయించి సక్రమంగా పార్కుల నిర్వహణ జరిగేలా చూడాలని హెచ్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేష్ వెటర్నరీ అధికారి డాక్టర్ గోపాల్‌రావు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా నాయక్ హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, అశ్విని, ప్రవళిక పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై ఏసీపీ విచారణ



ఖిలా వరంగల్: ప్రేమ వివాహం చేసుకుని వరకట్న వేధింపులు, కులం పేరుతో దూషిస్తున్న ఓ వ్యక్తిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్‌నాయక్ బుధవారం విచారణ చేపట్టారు. 2020వ సంవత్సరంలో పడమర కోటకు చెందిన శాబోతు స్వామి, లేబర్‌కాలనీకి చెందిన భార్గవి కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి కుమార్తె పుట్టిన తర్వాత వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. కార్యక్రమంలో ఏసీపీ రైటర్ నర్సయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అస్థిత్వం కోల్పోయిన యూనివర్సిటీ



మాట్లాడుతున్న మాచర్ల రాంబాబు

కేయూ క్యాంపస్: గత బీఆర్ఎస్ పాలనలో కాకతీయ యూనివర్సిటీ తన అస్తిత్వాన్ని కోల్పోయిందని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు అన్నారు. యూనివర్సిటీలో గెస్ట్‌హౌస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల కాలంలో వీసీగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ రమేష్ తన కోటరీని కీలకమైన బాధ్యతల్లో ఉంచి విద్యార్థులు, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. వీసీగా రమేష్ అనేక అవకతవకలు పాల్పడ్డారని అన్నారు. వీసీ లాడ్జ్ నుంచి కొన్ని కీలకమైన ఫైళ్లు మాయమయ్యాయన్నారు. సమావేశంలో ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, నాయకులు గట్టు ప్రశాంత్, సాయి, చంద్రశేఖర్, కేయూ ఉపాధ్యక్షుడు రాజు బాధ్యులు లక్ష్మణ్, విష్ణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఎమ్మెల్సీ' ప్రచారం



సాక్షి నెట్‌వర్క్: తమ పార్టీ అభ్యర్థిని ఎమ్మెల్సీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆయా పార్టీల నాయకులు బుధవారం నగరంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కరపత్రాలను పంచుతూ తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్లను అభ్యర్థించారు.

బీడీ కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఖాసీం

వరంగల్ చౌరస్తా: తమ సమస్యల పరిష్కారానికి బీడీ కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఖాసీం పిలుపునిచ్చారు. వరంగల్ లక్ష్మీపురంలో బీడీ కార్మికులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తునికి ఆకు సమస్య, చేసిన బీడీలకు రేటు, తదితర సమస్యలు పోరాటాలు చేయాలని ఖాసీం సూచించారు. ఈ సమావేశంలో నాయకులు అంజలి, గోనె శ్రీహరి, కవిత, రమాదేవి, స్వరూప, శ్రీలత, జరీనా బేగం, రజిని తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలి



కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట: రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500ల బోనస్ అందించి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై రైతులతో చర్చించారు. సన్న రకానికే కాకుండా దొడ్డు రకం వడ్లకు కూడా మద్దతు ధర ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం కార్యదర్శి సంటి రవి, మడిగ నాగరాజు, గోపాల్, శ్రీనివాస్, శంకర్ రెడ్డి, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి విశేష పూజలు



రామన్నపేట: లక్ష్మీనృసింహ స్వామి జయంతి సందర్భంగా నగరంలోని భద్రకాళి దేవాలయం రోడ్డులోని సింహాద్రి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించినట్లు అర్చకులు రాము, రాఘవాచారి తెలిపారు. స్వామి వారికి అష్టాదశ ఘటాభిషేకం హోమం చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం వివిధ పూల అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చినట్లు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహ స్వామి సేవా సమితి సింహాద్రి బాగ్ రోడ్, కమిటీ సభ్యులు తాటికొండ రాము, తాటికొండ గోపికృష్ణ, శ్రీరాముల సురేష్, దేవా హరిందర్, దుబ్బా శీను, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు పెరుగుతో అభిషేకం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని దక్షిణముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం స్వామి వారికి 108 లీటర్ల పెరుగుతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనగం యాదగిరి, మిట్టపల్లి రవీందర్, బెదరకోట రంజిత్ కుమార్, వెంకట్, చిలువేరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌కు జనగామ, ములుగు జట్లు

దేశాయిపేట: నగరంలోని సీకేఎం కళాశాల మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న జయ ప్రకాశ్ మెమోరియల్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం జరిగిన సెమీఫైనల్స్ మ్యాచ్‌లో జనగామ జట్టు.. హనుమకొండ జట్టుపై 25 పరుగుల తేడాతో, ములుగు జిల్లా జట్టు వరంగల్ జట్టుపై 4వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరాయి. గురువారం ములుగు, జనగామ జిల్లాల జట్ల మధ్య సీకేఎం మైదానంలో ఉదయం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని వరంగల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

రుణం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

రామన్నపేట: బ్యాంకు లోన్ ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రేమ్‌చంద్ అనే వ్యక్తి తన వద్ద నుంచి రూ. 42వేలు వసూలు చేశాడని పేర్కొంటూ కాకతీయ థియేటర్ వద్ద మేడిది శ్రీధర్ అనే వ్యక్తి పెట్రోల్ బాటిల్ పట్టుకుని ఆత్మహత్యకు పాల్పడుతానని బుధవారం నిరసన తెలిపారు. ఈమేరకు ప్రేమ్‌చంద్‌తో పాటు శ్రీధర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

రైల్వే ఉద్యోగి బైక్ చోరీ

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో పనిచేస్తున్న జోసెఫ్ అలెగ్జాండర్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీకి గురైంది. ఈమేరకు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న వినీల

హన్మకొండ అర్బన్: బాధిత మహిళలు, బాలికలు 181 సేవలు, సఖి వన్ స్టాప్ కేంద్రం సేవలను సద్వినియోగించుకోవాలని సఖి వన్ స్టాప్ కేంద్రం కేస్ వర్కర్ వినీల సూచించారు. నగరంలోని అడ్వకేట్స్ కాలనీలోని మను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో హనుమకొండ సఖి వన్ స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన పిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్‌ను తీసుకొచ్చిందని వివరించారు. మహిళలపై వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛిత్తి చేయించుకోవాలని వేధింపులకు గురి చేయడం, ఇతర వేధింపుల పట్ల మానసికంగా కుంగిపోయే మహిళలు, బాలికల రక్షణకు సఖి వన్ స్టాప్ కేంద్రం కృషి చేస్తోందని వినీల వివరించారు. బాధితులు 0870 – 2452112 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో మను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఇన్‌చార్జ్ అనిల్, స్థానిక మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చేపలు పట్టే హక్కు ముదిరాజ్‌లదే..



మాట్లాడుతున్న దేవేందర్

కాళోజీ సెంటర్: గత ప్రభుత్వ జీఓల ప్రకారం చేపలు పట్టే హక్కు ముదిరాజ్‌లకే చెందుతుందని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర కమిటీ సభ్యులు తెలిపారు. హనుమకొండలోని మెపా కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడారు. ముదిరాజ్‌లు ఇతర కులాల మధ్య వివాదం కారణంగా కమిటీని ఇటీవల హైకోర్టు ఏర్పాటు చేసి, ఈ వివాదాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వానికి 3నెలల కాలపరిమితి విధించిందని గుర్తుచేశారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులకు ప్రస్తుతం జస్టిస్ బీమపాక నగేష్ ఆదేశాలు జారీ చేస్తూ 3నెలల్లోగా ఈ సమస్య పరిష్కారం కోసం కమిటీ వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు. సమావేశంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు, పిట్టల రమేష్, కూతురు రాజు, గౌతమ్ కృష్ణ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివిన 1993 – 1994వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. 30 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు చేరుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో తాళ్ల రాజేందర్, వనం శ్రీకాంత్, రామారావు, తిరుపతి, నాగరాజు, నరేందర్, హరి, మధు, సరిత, వెంకటలక్ష్మి, శోభారాణి, రామచందర్ పాల్గొన్నారు.

మాజీ వీసీ రమేష్‌కు సన్మానం



సన్మానిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ తాటికొండ రమేష్ మూడేళ్ల పాలన ముగిసిన విషయం తెలిసిందే. ఈమేరకు మాజీ వీసీని పలువురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు హనుమకొండలోని ఆయన నివాసంలోనే బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేయూ వీసీగా రమేష్ పాలనలో కేయూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందని, ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించారని, హాస్టళ్ల నిర్మాణం చేపట్టారని కొనియాడారు. రమేష్‌ను సన్మానించిన వారిలో కేయూ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఇన్‌చార్జ్ అధిపతి, అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్, హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, యూనివర్సిటీ విద్య కళాశాల ప్రిన్సిపాల్, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రణధీర్‌రెడ్డి, పొలిటికల్ సైన్స్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, స్టాటిస్టిక్స్ విభాగం అధిపతి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కుట్ర కేసు నుంచి వెంకటరెడ్డి పేరును తొలగించాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: మూడు నెలల క్రితం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నేతలపై పూసపెల్లి కుట్ర కేసు పెట్టారని, ఆ కేసులో భాగంగా ఈనెల 21న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి పేరును చేర్చడాన్ని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు ఖండించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ కేయూ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ మొగిలి వెంకటరెడ్డిని పేరును పూసపెల్లి కుట్ర కేసులో చేర్చడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఇది ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. గడీల పాలనను బద్దలు కొట్టి ప్రజా పాలనను తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర్ఎస్ ప్రభుత్వంలాగే అణిచివేతలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో నరసింహ, రత్నాకర్, వెంకట్, అజిత్, హరీష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పార్ట్‌టైం లెక్చరర్ల ఆందోళన



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పలు విభాగాలు, కళాశాలల్లో 16 పీరియడ్‌ల వర్క్ లోడ్‌తో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా కన్వర్షన్ చేయాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పరిపాలన భవనం వద్ద బైఠాయించి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేయూ ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు స్వీకరించిన వాకాటి కరుణ స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్ట్‌టైం లెక్చరర్లు భాగ్యమ్మ, మాధవి, వాణిదేవి, సృజన, సుధీర్, శ్రీధర్, రవీందర్, సదానందం, రవీందర్‌రెడ్డి, శ్యాంసుందర్ చారి, బి.శ్రీనివాస్, భిక్షపతి, బాలకృష్ణ, రజనీకుమార్, అన్నపూర్ణ పాల్గొన్నారు.